క్లుప్తంగా

మాలలపై దాడి దారుణం



మాట్లాడుతున్న చీకటిమల్లి మంగరాజు

పాలకోడేరు: ఆరవల్లి మాలలపై జరిగిన దాడిని మాల జేఏసీ సంఘాల నాయకులు ఖండించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమల్లి మంగరాజు మాట్లాడుతూ ఆరవల్లి గ్రామంలో మారణా యుధాలతో మాలలపై దాడి చేయడం చాలా దారుణమని అన్నారు. షెడ్యూల్ కులాల ప్రజలంతా ఐక్యతగా ఉండాలని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో పయనించాలని కోరారు. ఈ సమావేశానికి కొండేటి లాజర్ అధ్యక్షత వహించగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, కోన జోసెఫ్ తాడి రాజశేఖర్, కురుకుంటి పాలు, గోగులమండ యాకోబు, మట్టి జార్జి, గండి నాని తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: సమైక్య భారతావని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని, ఆయన ఆశయసాధన కోసం ముందుకు సాగాలని బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరి సాయి దుర్గరాజు అన్నారు. ఆదివారం బీజేపీ భీమవరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా రాయలం గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ భీమవరం పట్టణ పడమర, తూర్పు అధ్యక్షుడు వబిలిశెట్టి ప్రసాదరావు, అడబాల శివ, నాయకులు పాల్గొన్నారు.

కొట్లాట కేసు నమోదు

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొవ్వాడపుంతకు చెందిన ఎస్ సందీప్, గునుపూడికి చెందిన కె తరుణ్ మధ్య బట్టికొట్టు వద్ద వివాదం ఏర్పడడంతో రాళ్లతో కొట్టుకున్నారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్తపై కేసు నమోదు

భీమవరం: భర్త వేధిస్తున్నాడంటూ భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గాపురం ప్రాంతానికి చెందిన ఎ నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్ స్వామి చెప్పారు. నర్సమ్మకు దుర్గాపురానికి చెందిన మావుళ్లుకు 20 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. ఆదివారం భార్యభర్తల మధ్య వివాదం ఏర్పడడంతో మావుళ్లు నర్సమ్మను తలపై కొట్టడంతో గాయపడింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీఐ కె బలరామరాజు ఆదేశాల మేరకు ఆదివారం తుందుర్రు గ్రామంలో ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు బెల్టు షాపు నిర్వహిస్తుండటంతో అతడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: గత విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 32 మంది విద్యార్థులకు ఆదివారం తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనం ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమత్కాళీ వరప్రసాద్ బాబా ఆశ్రమంలో స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఎమ్మెల్యే అంజిబాబు చేతులమీదుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహిస్తూ తుమ్మలపల్లి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

భీమవరం: తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరస్వామి ఆలయాలు, శైవక్షేత్రాలు, అమ్మవారి ఆలయాలను భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. భీమవరం పట్టణంలోని సంకా వెంకటరత్నం శారద నిలయంలో ఆదివారం వందమంది మహిళలతో శ్రీమన్నారాయణీయం సంపూర్ణ పారాయణం నిర్వహించారు. నిర్వాహకులు సంకా శారద, తాళ్లూరి లక్ష్మి మాట్లాడుతూ శ్రీశృంగేరి పీఠాధిపతులు పరమానుగ్రహంతో సౌందర్యలహరి, శివానందలహరి, ఆర్య ద్విశతి, మూక పంచశతి, శ్రీమన్నారాయణీయం స్పష్టంగా, అర్థవంతంగా నేర్చుకునే విధంగా ధార్మిక మూలాలను సాధన చేసిన అనేక ప్రాంతాల్లో తమ సభ్యులతో పారాయణం కార్యక్రమం నిర్వహించామన్నారు. మహిమాన్వితమైన భక్తి రస పూరిత గ్రంథం పారాయణం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, స్వామి సాక్షాత్కారం కలుగుతుందనే నమ్మకంతో 1,800 శ్లోకాలతో ఉన్న గ్రంథ పారాయణం ఏకధాటిగా స్తుతించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూలి ప్రేమలత, శెట్టి ధనలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

పర్లమ్మకు ఆషాఢం సారె సమర్పణ

కాళ్ల: మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామ దేవత శ్రీపర్లమ్మకు ఆదివారం సారె సమర్పించారు. సర్పంచ్ తానింకి నాగరాజు, ఝాన్సీ లక్ష్మి దంపతులు, రఘు, సౌజన్య దంపతులు ఆధ్వర్యంలో అమ్మవారికి సుమారు 500 కేజీలతో తయారు చేయించిన పలు రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు కలిగిన సారె బిందెలు, కావిళ్లతో మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించి అమ్మవార్లకు సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

వెంకన్నకు ఊంజల్ సేవ

కాళ్ల: కాళ్ళకూరులో వేంచేసి ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శత నామార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. తొలిఏకాదశి పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భీమవరం (ప్రకాశం చౌక్): వేంకటేశ్వరస్వామికి తులసీ బృందార్చన నిర్వహించిన దృశ్యం



భీమవరం (ప్రకాశం చౌక్): శాకాంబరి దేవి అలంకరణలో బాల త్రిపుర సుందరి అమ్మవారు

వేంకటేశ్వరస్వామికి తలసీ బృందార్చన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జేపీ రోడ్‌లో ఉన్న శ్రీ దంతులూరి జగన్నాథ రాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం స్వామి వారికి తులసీ బృందార్చన నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహించుకున్నారు. సత్రం వంశపారంపర్య చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

పట్టణంలోని మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రత పూజలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్, కాశీభట్ల మణికంఠ శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పట్టణానికి చెందిన మరిశెట్టి తాతారావు దంపతులచే అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరణ చేశారు. నంద్యాల రవివర్మ దంపతుల సహకారంతో 60 మంది భక్తులచే సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

విశేషాలంకరణలో..

భీమవరం అర్బన్: తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం యనమదుర్రులోని శక్తీశ్వర ఆలయం, గొల్లవానితిప్పలోని శ్రీ వేంకటేశ్వరాలయం శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన, గో క్షీరాభిషేకాలు జరిపారు. విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం స్వామి వార్లకు తులసి దళాలతో అలంకరించి పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో విశేషాలంకరణలో శ్రీ కోదండ రామ స్వామి

కిటకిటలాడిన దేవాలయాలు

ఆకివీడు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలోని పార్వతీ సమేత వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా, మహిళలు ఆషాఢ మాస సారెను సమర్పించారు. రాజరాజేశ్వరి సహిత మార్కండేశ్వరస్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. మదన గోపాలస్వామి ఆలయంలో గీతామహిళా మండలి ఆధ్వర్యంలో లక్ష తులసి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాకర్ల రాజరాజేశ్వరి, కె.రాజ్యలక్ష్మి, సత్యశ్రీ వాణి, అర్చకులు సుబ్రహ్మణ్యరవి, శేషాచార్యులు, శ్రీను పాల్గొన్నారు.



భీమవరం: శ్రీమన్నారాయణీయం సంపూర్ణ పారాయణంలో పాల్గొన్న మహిళలు



కాళ్ల: ఎల్ఎన్ పురంలో ఊరేగింపుగా సారె తీసుకువస్తున్న మహిళలు



కాళ్ల: వెంకన్నకు సహస్రా దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడు: పిల్లల మర్రి అగ్రహారంలోని శివాలయంలో సారె సమర్పిస్తున్న భక్తులు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- శిథిలావస్థలో ఆర్అండ్‌బీ బంగ్లా, ఇరిగేషన్ డీసీ కార్యాలయ భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

ఉండి: ఉండిలోని ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కోట్ల రూపాయల విలువైన స్థలాలను ఇలా వృథాగా వదిలేయడంపై నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆ స్థలాల్లో పాత భవనాలు తొలగించి వ్యాపార సముదాయలు నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఉండికి తలమానికంగా సుమారు రెండెకరాల స్థలంలో ఉన్న ఆర్అండ్‌బీ బంగ్లా సుమారు 15 ఏళ్ల క్రితం వరకు సేవలందించింది. ఎన్నో రాజకీయ పార్టీల సమావేశాలు, సభలు కూడా ఈ ప్రాంగణంలోనే జరిగేవి. అనంతరం ఈ భవనం ప్రాంగణంలోనే ఆర్అండ్‌బీ ఇంజనీర్ కార్యాలయం కూడా పాడవడంతో ఆయన భీమవరం నుంచే విధులు నిర్వహించడంతో భవనం పూర్తి నిరాదరణకు గురై పాడైపోయింది. ఉండి నడిబొడ్డులో ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు ఉండి గణపవరం, తాడేపల్లిగూడెం రాష్ట్రీయ రహదారి వుండగా వాటిని అనుకుని ఉన్న ఈ బంగ్లా స్థలం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి గురికావడంతో భవనం, ప్రాంగణం పూర్తిగా పాడై విష సర్పాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది.



ఉండి సెంటర్లో నిరుపయోగంగా ఉన్న ఆర్అండ్‌బీ బంగ్లా భవనం



నిరుపయోగంగా పాత వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ కార్యాలయం

కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చితే..

నిరుపయోగంగా ఉన్న కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఉండి సెంటర్ అభివృద్ధి చెందుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో ఉండి సెంటర్‌లో ఎన్నో చిరువ్యాపారుల దుకాణాలను అధికారులు, ప్రజాప్రతినిధులు తొలగించడంతో వ్యాపారాలు చేసేందుకు వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ బంగా తొలగించి ఆ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ లేదా మల్టిప్లెక్స్ వంటిది నిర్మాణం చేపడితే ఎంతో మందికి ఉపయోగంగా ఉంటుందని అంటున్నారు.

గతంలో ప్రయత్నం

గతంలో నాటి టీడీపీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకటశివరామరాజు ఆర్అండ్‌బీ బంగ్లా స్థానంలో మల్టీప్లెక్స్ నిర్మించాలని ప్రయత్నాలు చేశారు. కానీ ఏం జరిగిందో తెలియదు గానీ ఒక్కఅడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పుడైనా ఆర్అండ్‌బీ బంగ్లా స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్ లేదా మల్టీప్లెక్స్ నిర్మాణం చేస్తే ఉండి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు, వ్యాపారులు, ప్రజలు కోరుకుంటున్నారు.

నిర్లక్ష్యంగా డీసీ కార్యాలయ పాత భవనం

ఉండి ఇరిగేషన్ వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)కి కొత్త భవనం నిర్మించడంతో పాతభవనాన్ని అధికారులు, నాయకులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ కార్యాలయ భవనం కూడా చాలా ఏళ్ల క్రితం నిర్మిచడంతో పూర్తిగా క్షీణదశకు చేరుకుంది. అధికారులు కూడా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ కార్యాలయం కూడా సుమారు అర ఎకరం స్థలంలో ఉండగా ఇక్కడ కూడా పాత భవనాన్ని తొలగించి మరో ప్రభుత్వ కార్యాలయం లేదా ఊరికి చివరన ఉన్న ప్రభుత్వాసుపత్రిని ఇక్కడకు మార్చితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చర్చిలో పాస్టర్ల బాహాబాహీ

నరసాపురం: పట్టణంలోని మొగల్తూరు రోడ్డులో ఉన్న ప్రసిద్ధ లూథరన్ చర్చిలో ఇద్దరు పాస్టర్ల మధ్య మొదలైన వాగ్వివాదం చివరకు ఉద్రిక్తతకు దారి తీసింది. ఇద్దరు పాస్టర్లు వారి అనుచరులు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. చర్చిలోనే ఒకరికొకరు తోసుకుని కొట్లాటకు దిగడంతో ఆదివారం ప్రార్థనకు చర్చికి వచ్చిన భక్తులు భయాందోళనతో పరుగులు తీశారు. పాస్టర్లు చంద్రశేఖర్, నవకుమార్ మధ్య ఎవరు చర్చిలో ప్రార్థన చేయాలనే అంశంపై గొడవ మొదలైంది. చర్చి కమిటీ సభ్యులు కూడా రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడడంతో భక్తులు షాక్ తిన్నారు. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

రేబిస్ వ్యాధిని టీకాలతో అరికట్టవచ్చు

భీమవరం: కుక్కల నుంచి మనుషులకు వ్యాపించే రేబీస్ వ్యాధిని టీకాలతో అరికట్టవచ్చునని భీమవరం ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఉప సంచాలకులు డాక్టర్ పి సుధీర్ బాబు అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ రేబీస్ వ్యాధి ప్రాణంతమైన వ్యాధి అని, ఇది కుక్కల నుంచి వ్యాపిస్తుందని తెలిపారు. పశువులు, పక్షుల నుంచి మనుషులకు రేబీస్, బర్డ్‌ఫ్లూ, బ్రూసిల్లోసిస్, అంత్రాక్స్, అమీబియాసిస్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రేబీస్ వ్యాధి నివారణకు కుక్కలకు తప్పనిసరిగా టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు జయకర్ జాన్సన్, పుండారి బాబు, వరలక్ష్మి, లలిత, గోసంరక్షణ సమితి అధ్యక్షుడు సుంకర దాసు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం



ఆకివీడులో కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

జాగ్రత్తలు పాటించాలి

ఆకివీడు: జంతువుల నుంచి వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీ సత్య సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పశువైద్య శాలల వద్ద కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 150 కుక్కలకు టీకాలు వేసినట్లు చెప్పారు. మండల పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఎక్సైజ్ వ్యవస్థ నిర్వీర్యం

పెనుమంట్ర: కల్తీ మద్యం, అక్రమ మద్యం, అరికట్టలేని అక్రమ బెల్టు షాపులు తొలగించలేని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఉన్నా లేకున్నా ఒకటేనని, కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థ నిర్వీర్యమైందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పెనుమంట్ర మండల సొసైటీ ప్రెసిడెంట్ల సమావేశం బ్రాహ్మణ చెరువు రైతు సంఘం కార్యాలయంలో కడలి బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నరసింహామూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి వీధిలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. బెల్టు షాపులు వల్ల తాటికల్లు అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపిందని విమర్శించారు. ఎక్సైజ్ వారికి ప్రభుత్వానికి తెలియకుండా కల్తీ మద్యం అక్రమ మద్యం వరదలా వస్తుందా? అని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు తొలగించి కల్లు గీత కుటుంబాలను ఆదుకోమని 14న కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్నామన్నారు. గీత కార్మికులు మోకులు ధరించి రావాలని విజ్ఞప్తి చేశారు.

అఖిల భారత సమ్మెలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

భీమవరం: కార్మిక సంఘాలపై ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన చేపట్టిన అఖిల భారత సమ్మెలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు పాల్గొంటున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కుమార్ చెప్పారు. ఆదివారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను తిరిగి పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ మందుల కంపెనీలు మెడికల్ రిప్రజెంటేటివ్స్‌పై సేల్స్ పరమైన ఒత్తిళ్లు చేయడం, ఉద్యోగాల నుంచి తొలగించడం, డిజిటలైజేషన్ మూలంగా పని ఒత్తిడులు పెంచడం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కేఎం సూర్యచంద్రరాజు, భీమవరం శాఖ అధ్యక్షుడు పి రమేష్ బాబు, కార్యదర్శి ఎస్ రమేష్, కోశాధికారి జి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



పాలకోడేరులో స్వచ్ఛందంగా రోడ్డు నిర్మించుకుంటున్న స్థానికులు

పాలకోడేరు: పాలకోడేరులో స్థానికులు శ్రమదానంతో రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. గత ప్రభుత్వం కోడు గట్టును చేర్చి ఉన్న రెండు ఎకరాల 20 సెంట్లు పేదల గృహాల కోసం కేటాయించింది. ఆ స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. అయితే ఇళ్లకు వెళ్లడానికి సరైన మార్గం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించండి మహా ప్రభో అని పంచాయతీ వారిని వేడుకొన్నా.. నిధుల కొరత కారణంగా వారు చేతులెత్తేశారు. దీంతో డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కునాధరాజు మురళి కృష్ణంరాజును ఆశ్రయించగా ఆయన స్పందించి కొంత మొత్తాన్ని ఇవ్వగా స్థానికులు ఇంటింటికీ కొంత సొమ్ము వేసుకుని రహదారి నిర్మించుకుంటున్నారు.